# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక


## నాతో నడిచిన
# సంగ్రామ సేనకు రుణపడి ఉంటా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న బండి సంజయ్‌కి తెలంగాణ బీజేపీ తెలంగాణ శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఢిల్లీలో పదవీ బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్

మిగతా 2లో...


RANGAREDDY, EDITION : 01, VOLUME : 94 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 06 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 94 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 6 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-


## రాజ్ భవన్‌లో కదలని ఫైల్
# డిపోల్లోనే నిలిచిన బస్సు లు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఆర్టిసి కార్మిక సంఘాలు రాజ్ భవన్ ముట్టడికి పిలునిచ్చాయి. శనివారం ఉదయం 6 గంటల నుండి ఉదయం 8 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్ లు బంద్ అయ్యాయి. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం లో విలీన బిల్లును వెంటనే ఆమోదం తెలపాలని డిమాండ్ చేసారు. హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ కార్మికుల నిరసనతో కాచిగూడ, బర్కత్

మిగతా 2లో...

# ఆసక్తికరంగా.. కంటోన్మెంట్ టిక్కెట్



- టాక్ ఆఫ్ ది పాలిటిక్స్‌గా మారిన టిక్కెట్
- హైదరాబాద్ లోని ఏకైక ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం
- ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సాయన్న మృతి
- అందరి చూపు ఈ అసెంబ్లీ స్థానంపైనే ..!

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికల పోరుకు సమయం అసన్నమవుతోంది. త్వరలోనే అధికారికంగా నోటిఫికేషన్ రాబోతుంది. ఎవరికి వారిగా టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన కంటోన్మెంట్‌లో టికెట్ కోసం అన్ని పార్టీల్లో కాంపిటీషన్ వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు టైం దగ్గర పడుతోంది. దీంతో ప్రధాన పార్టీల్లో టెన్షన్ పెరిగిపోతోంది. ఆయా పార్టీలన్నీ కూడా గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టాయి. మొన్నటి వరకు ఆపరేషన్ ఆకర్ష్‌తో కాంగ్రెస్ దూకుడు పెంచితే... ఇక మా వంతు అన్నట్లు బీఆర్ఎస్ కూడా షురూ చేసింది. కీలక నేతలతో టచ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రధాన ప్రత్యర్థి పార్టీల్లో అలజడి మొదలైందన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. త్వరలోనే చాలా సమీ కరణాలు మారే ఛాన్స్ కని పిస్తోంది. ఇక చిన్న

మిగతా 2లో...

## ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ
# కొండచరియలు
### ముగ్గురు మృతిచెందగా, మరో 17 మంది గల్లంతు



కేదార్‌నాథ్ - ప్రభాత సూర్యుడు

ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. రుద్రప్రయాగ్ జిల్లాలోని కేదార్‌నాథ్‌కు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న గౌరికుండ్ వద్ద ఈ ప్రమాదం

మిగతా 2లో...

## తెలంగాణ ప్రభుత్వంలో
# టీఎస్ఆర్టీసీ విలీనంపై గవర్నర్ గ్రీన్ సిగ్నల్

**గవర్నర్ వ్యవహారశైలికి నిరసనగా ఆర్టీసీ కార్మికులు జంగ్‌సైరన్**

**రాజ్‌భవన్ ముందు బైఠాయింపు.. దీంతో రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి**



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ప్రభుత్వంలో టీఎస్ఆర్టీసీ విలీనంపై గవర్నర్ తమిళిసై నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది!. ఆర్టీసీ బిల్లుపై కేసీఆర్ సర్కార్ ఇచ్చిన వివరణ పట్ల గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టేందుకు గవర్నర్ అనుమతి తెలపనున్నారు.! శనివారం సాయంత్రం కల్లా పుదుచ్చేరి నుంచి హైదరాబాద్‌కు గవర్నర్ రానున్నారు. ఇవాళ

మిగతా 2లో...

## బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో
### బెటర్ డెవలప్‌మెంట్ అని నిరూపిస్తే..
# మంత్రి పదవికి రాజీనామా చేస్తా
### మంత్రి కేటీఆర్ సవాల్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కంటే బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బెటర్ డెవలప్‌మెంట్ జరిగినట్లు నిరూపిస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర ఐటీ, పుర పాలక శాఖ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలపై శాసనసభలో

మిగతా 2లో...

## తెలంగాణలో కాంగ్రెస్ గెలిచే స్థానాలు ఇవే
# పీసీసీ చేతిలో కీలక రిపోర్టు!



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో ఎన్నికల మూడ్ వచ్చేసింది. అన్ని పార్టీలు ఎన్నికల వ్యూహరచన మొదలుపెట్టాయి. కదనరంగంలో నేతలంతా పూర్తిగా క్రియాశీలకమయ్యారు. ప్రధాన పార్టీలన్నీ గెలుపు గుర్రాల కోసం వేటను కొనసాగిస్తున్నాయి. ఎక్కడెక్కడ పార్టీ పరిస్థితి ఏవిధంగా ఉందో లెక్కలుకడుతున్నాయి. ఇందుకోసం సర్వేలు చేయించుకుంటున్నాయి. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఈసారి ఎలాగైనా

మిగతా 2లో...

# ఆర్టీసీ విలీనం కధ సుఖాంతం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ప్రభుత్వంలో టీఎస్ఆర్టీసీ బిల్లు వ్యవహారం రాష్ట్రంలో కాక రేపింది.. ఓవైపు గవర్నర్‌పై అధికార పక్షం నుంచి విమర్శలు వెల్లువెత్తగా.. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులు బంద్‌కు పిలుపునిచ్చారు.. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని గంటల పాటు డిపోలకే పరిమితం అయ్యాయి బస్సులు.. ఇక, రాజ్‌భవన్ వరకు ర్యాలీగా వెళ్లారు కార్మికులు.. అందులో కొంతమంది నేతలను లోపలికి పిలిచి చర్చలు జరిపారు గవర్నర్ తమిళిసై.. కార్మిక సంఘాల నేతలు, గవర్నర్ మధ్య సుదీర్ఘంగా ఈ భేటీ జరిగింది.. ఆ సమావేశం ముగిసిన తర్వాత బయటకు వచ్చిన నేతలు మీడియాతో మాట్లాడుతూ.. చర్చల సారాశాంన్ని వివరించారు.ఆర్టీసీ బిల్లు విషయంలో గవర్నర్ తమిళిసై సానుకూలంగా స్పందించారని తెలిపారు ఆర్టీసీ యూనిన్ లీడర్ థామస్ రెడ్డి.. సుదీర్ఘంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చించాం.. సమ్మె కాలంలో కూడా నేను మీకు సహకరించాను అని గుర్తుచేశారని తెలిపారు. ఇక, కార్మికుల మేలు కోసమే విలీనం విషయంలో ప్రభుత్వానికి ప్రశ్నలు రాశాను అని చెప్పారు.. ప్రభుత్వం కూడా సమాధానాలు రాసి పంపినట్లు తెలిసింది.. కానీ.. మా ఆఫీస్ కి ఇంకా అందలేదు అని గవర్నర్ చెప్పారని వెల్లడించారు. ఆర్టీసీ బిల్లును

మిగతా 2లో...

# మణిపూర్‌లో కొనసాగుతున్న లూటీలు



ఇంపాల్- ప్రభాత సూర్యుడు

గిరిజనులు, గిరిజనేతురల మధ్య పోరుతో మణిపూర్ లో ఇంకా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగూతూనే ఉన్నాయి. రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలు మోహరించినా.. మణిపూర్ లో పరిస్థితులు ఏమాత్రం కుదుటపడటం లేదు. హింసతో అట్టుడికిపోతున్న మణిపూర్ లో తాజాగా మరోసారి భయానక ఘటన వెలుగు చూసింది. దుండగుల ముఠా పోలీసు

మిగతా 2లో...

## రాజ్ భవన్‌లో కదలని ఫైల్
# డిపోల్లోనే నిలిచిన బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

పుర బస్ డిపోల లోబస్సులు నిలిచిపోయాయి. ప్రజా రవాణా వ్యవస్థను , ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఇటీవలే మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించిన బిల్లును ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదింప చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ మేరకు మంత్రివర్గ నిర్ణయానికి అనుగుణంగా యుద్ధ ప్రాతిపదికన బిల్లును రూపొందించి.. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కు పంపించింది. సాంకేతికపరంగా అది ఆర్థిక బిల్లు కావడం వల్ల గవర్నర్ ఆమోదం కోసం.. రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రాజ్ భవన్ పంపింది.

ఆర్టీసీ బిల్లును ప్రవేశపెట్టేందుకు గవర్నర్ ఆమోదం తెలపలేదు. అనుమతి తెలిపితే ఇతర బిల్లులతో పాటు ఇవాళ అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. గవర్నర్ నుంచి అనుమతి రాకపోవడంతో ఎజెండాలో పొందుపరచలేదు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా గవర్నర్ నుంచి ఆమోదం రావాల్సి ఉంది. బిల్లు పంపి.. ఇప్పటికే రెండు రోజులైనా అనుమతి ఇవ్వకపోవడాన్ని పలువురు తప్పు పడుతున్నారు.

## ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ
# కొండచరియలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా, మరో 17 మంది గల్లంతు అయినట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం గౌరీకుండ్ వద్ద రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు. భారీ స్థాయిలో రాళ్లు, మట్టిపెల్లలు పడడంతో.. రోడ్‌సైడ్ ఉన్న షాపులు, దాబాలు కొట్టుకుపోయాయి. అయితే ఆ షాపులు, దాబాల్లో నలుగురు స్థానికులతో పాటు 16 మంది నేపాలీలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఎస్డీఆర్ఎఫ్ దళాలు సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టినట్లు జిల్లా అధికారులు వెల్లడించారు. ఉత్తరకాశీలో కూడా కొండచరియలు విరిగిపడ్డాయి. హిమాచల్ ప్రదేశ్‌తో ఉన్న బోర్డర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. అరాకోట్–చిన్వా రూట్లో ఉన్న మోల్డీ వద్ద భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. డజన్ల సంఖ్యలో స్థానిక గ్రామస్థులతో సంబంధాలు తెగిపోయాయి. ఆ రూట్లో వెళ్తున్న ప్రయాణికులు ఎక్కడిక్కడ నిలిచిపోయారు.

## తెలంగాణ ప్రభుత్వంలో
# టీఎస్ఆర్టీసీ విలీనంపై గవర్నర్ గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

రాత్రిలోగా ఆర్టీసీ బిల్లుకు ఆమోదం తెలిపనున్నట్లు తెలియవచ్చింది. ఆర్టీసీ సంస్థ , ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా బిల్లుపై న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం తమిళిసై పచ్చజెండా ఊపారని తెలిసింది. ఈ విషయం బయటికి రావడంతో ఆర్టీసీ కార్మికులు ఆనందంలో మునిగితేలుతున్నారు. మొదట ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ రూపొందించిన బిల్లులో అభ్యంతరాలు ఉన్నాయంటూ గవర్నర్ తమిళిసై బిల్లును అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గవర్నర్ లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈమేరకు కాపీని రాజ్‌భవన్‌కు పంపించింది. ఆర్టీసీ కార్మికులకు కార్పొరేషన్ కంటే మెరుగైన జీతాలు ఉంటాయని ప్రభుత్వం అందులో పేర్కొన్నది. విలీనమైన తర్వాత రూపొందించే గైడ్‌లైన్స్‌లో అన్ని అంశాలు ఉంటాయని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ వాటా, 9వ షెడ్యూల్ సమస్యలను ఆంధ్రప్రదేశ్ తీరుగానే పరిష్కరిస్తామని వెల్లడించింది. తెలంగాణలోని ఆర్టీసీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బిల్లు రూపొందించింది. ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీ విలీనం బిల్లు పాస్ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది. కానీ ఆర్టీసీ విలీనం బిల్లుకు రాజ్‌భవన్ మోకాలడ్డుతోంది. సాంకేతికంగా మనీ బిల్లు కావడంతో గవర్నర్ కాన్సెంట్ కోసం రాష్ట్ర సర్కార్ పంపింది. అయితే బిల్లుపై గవర్నర్ పలు అభ్యంతరాలను వెలిబుచ్చారు. బిల్లు ఆమోదానికి తనకు కొంత సమయం కావాలని చెప్పారు. దీంతో సభలో ఆర్టీసీ బిల్లును ప్రవేశపెట్టడానికి అడ్డంకిగామారింది. ఈ నేపథ్యంలో గవర్నర్ వ్యవహారశైలికి నిరసనగా ఆర్టీసీ కార్మికులు జంగ్‌సైరన్ పూరించారు. శనివారం ఉదయం 2 గంటలపాటు బస్సులను నిలిపివేశారు. డిపోల ముందు ధర్నా నిర్వహించారు. గవర్నర్ బంగ్లాను ముట్టడించిన ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది.. రాజ్‌భవన్ ముందు బైఠాయించారు. దీంతో రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో గవర్నర్ లేవనెత్తిన అభ్యంతరలకు ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

## తెలంగాణలో కాంగ్రెస్ గెలిచే స్థానాలు ఇవే
# పీసీసీ చేతిలో కీలక రిపోర్టు!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణను హస్తగతం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల వేట మొదలుపెట్టింది. ఈ మేరకు కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు టీమ్ సర్వే చేపట్టి కీలక రిపోర్టును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌కి అందజేసింది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై ఈ టీమ్ నివేదికను రూపొందించింది. రిపోర్ట్‌లో ఏముందంటే..119 సీట్లను 3 భాగాలుగా సునీల్ విభజన:ం. కేటగిరీలో 41 స్థానాలు,ః. కేటగిరీలో 42 స్థానాలు,అ. కేటగిరీలో 36 స్థానాలు.ఏ కేటగిరీలోని స్థానాలను కాంగ్రెస్ పార్టీ గన్‌షాట్‌గా గెలుచుకుంటుందని సునీల్ కనుగోలు టీమ్ అంచనావేసింది. ఇక బీ కేటగిరీలో కొంచెం కష్టపడితే గెలిచే స్థానాలుగా పేర్కొంది. సీ కేటగిరీ సీట్లలో బలహీనంగా ఉందని పేర్కొన్నారు. బీ కేటగిరీ స్థానాల్లో గెలిస్తేనే పార్టీ అధికారంలోకి వస్తుందని రిపోర్ట్‌లో సూచించారు. బీ కేటగిరీ సీట్లలో బలం పెంచుకునేందుకు పార్టీ నేతలకు సునీల్ టీమ్ దిశానిర్దేశనం చేసింది.

**ఈ నెలలోనే మొదటి జాబితా?**

మరోవైపు..శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కేసీ.వేణుగోపాల్‌కు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి గాంధీభవన్‌కు చేరుకుని సునీల్ టీమ్ అంద జేసిన రిపోర్టుపై మేధోమథనం చేశారు. ఇదిలా ఉంటే ఈనెలలోనే మొదటి జాబితాలో కొన్ని అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు టాక్ నడుస్తోంది. అలాగే బీఆర్ఎస్‌లో కూడా ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే సీఎం కేసీఆర్ కూడా అభ్యర్థులను ప్రకటించే ఛాన్స్ ఉందని చర్చ నడుస్తోంది.

# ఆర్టీసీ విలీనం కథ సుఖాంతం

(మొదటి పేజీ తరువాయి)

ఆపడం నా ఉద్దేశం కాదు.. ప్రభుత్వానికి కొన్ని డౌట్స్ ఉన్నాయని రాసి క్లారిఫికేషన్ కోసం అడిగాను.. అసెంబ్లీ సెషన్ ముగిసే లోపు కచ్చితంగా ఆమోదించేనీదుకు ప్రయత్నిస్తానని చెప్పినట్టు పేర్కొన్నారు. సత్వర పరిష్కారం చేసేందుకు ప్రయత్నం చేస్తాను అని గవర్నర్ తెలిపారన్న ఆయన.. నేరుగా ఆమె ఏమైనా సవరణలు ఉంటే రాసి పంపడానికి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసమే.. నేను కొన్ని ప్రశ్నలు లేవనెత్తాను అని గవర్నర్ అన్నారని చెప్పుకొచ్చారు. గవర్నర్ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడానికి అనుమతి ఇవ్వాలి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ తీర్మానం చేసిన తర్వాత గవర్నర్ ఆమోదించేందుకు సిద్ధంగా ఉన్నట్టుగా థామస్ రెడ్డి వెల్లడించారు. మరోవైపు.. టీఎస్ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు సంబంధించిన బిల్లులో ఐదు అంశాలపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వివరణ కోరారు. ఆర్టీసీలో కేంద్ర గ్రాంట్లు, వాటాలు, లోన్ల వివరాలు లేవు. ఉద్యోగుల ప్రయోజనాలు ఎలా కాపాడుతారు? ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వారికి పింఛన్ ఇస్తారా? విభజన చట్టం ప్రకారం ఆర్టీసీ స్థితిని మార్చడంపై వివరాలు లే పదోన్నతులు, క్యాడర్ నార్మలైజేషన్లో న్యాయం ఎలా చేస్తారు?, అని రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ ప్రశ్నించారు. అలాగే ఆర్టీసీ కార్మికుల భద్రత, ప్రయోజనాలపై స్పష్టమైన హామీలను తమిళిసై కోరిన విషయం విదితమే.

## నాతో నడిచిన
# సంగ్రామ సేనకు రుణపడి ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి నాంపల్లి బీజేపీ కార్యాలయం వరకు అభిమానుల కోలాహలం కనిపించింది వేలాదిగా వచ్చిన అభిమానులతో కలిసి బండి సంజయ్ బిజెపి కార్యాలయం వరకు భారీ ర్యాలీ ద్వారా వచ్చారు. వేద పండితులు ఆయనకు ఆహ్వానం పలికారు బిజెపి మహిళా కార్యకర్తలు బండి సంజయ్‌కి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బండి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. 'వందల కిలోమీటర్లు నాతో నడిచిన సంగ్రామ సేనకు రుణపడి ఉంటాను. ఇంత పెద్ద అవకాశమిచ్చిన మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలకు ధన్యవాదాలు. ఎన్నికల యుద్ధ రంగంలో ఉన్నాం. కార్యకర్తల త్యాగాలను వృథాగా పోనివ్వము. గోల్‌కొండపై కాషాయ జెండాను రెపలాడిస్తాం. బీజేపీలో గ్రూపులున్నాయని, పార్టీ గ్రాఫ్ తగ్గిందనేది కేవలం దుష్ప్రచారమే. మా మధ్య ఎలాంటి విబేధాలు లేవు, పార్టీని అధికారంలోకి తీసుకొని రావడమే మా లక్ష్యం. కిషన్‌రెడ్డి నాయకత్వంలో అందరం కలిసికట్టుగా పనిచేస్తాము' అని చెప్పుకొచ్చారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో ఫైర్ అయ్యారు బండి సంజయ్. వర్షాలతో జనం విలవిల్లాడితే పరామర్శించని కేసీఆర్ మహా రాష్ట్రలో రాజకీయాలు చేస్తున్నడన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసే మళ్లీ హామీల అమలు పేరుతో ఎన్నికల స్టంట్ చేస్తున్నడనన్నారు. రుణమాఫీ, వీఆర్ఏ, జేపీసీల క్రమబద్ధీకరణ వంటి హా మీలు ఎన్నికల డ్రామాలేనని విమర్శించారు. కేసీఆర్‌ను ఎవరు నమ్మరన్న బండి సంజయ్.. సర్కార్ దగ్గర పై సల్లేక ఎన్నికల తాయిలాల కోసం భూములను అమ్ముకునే దుస్థితి వచ్చిందన్నారు.

# ఆసక్తికరంగా .. కంటోన్మెంట్ టిక్కెట్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలు కూడా తమ వంతు ప్రయత్నాలను షురూ చేస్తున్నాయి. అయితే గ్రేటర్ హైదరాబాద్ లో ఉన్న కంటోన్మెంట్‌లో టికెట్ రేస్ మాత్రం అత్యంత ఆసక్తికరంగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలోని చాలా మంది నేతలు... ఈ టికెట్ కోసం తెగ పోటీ పడుతున్నారు. తమకు ఇవ్వాలంటే తమకు ఇవ్వాలని పార్టీల హైకమాండ్ పెద్దలను కోరుతున్నారట..! దీంతో అసలు కంటో న్మెంట్‌లో టికెట్ రేసులో ఎవరు ఉండబోతున్నారనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్‌గా మారింది. కంటోన్మెంట్... గ్రేటర్ హైదరాబాద్ లోని ఏకైక ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం. సికింద్రాబాద్ ఏరియాకు అనుబంధంగా ఉంటుంది. సైనికనివాస ప్రాంతంగా గుర్తింపు పొందింది. కొద్దిరోజుల కిందటే... ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సాయన్న మృతి చెందారు. దీంతో అందరి చూపు ఈ అసెంబ్లీ స్థానంపైనే పడింది. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన ఆశావహుల సంఖ్య పెరిగింది. ఎన్నికలకు ముందుగానే నేతల పోటాపోటీ కార్యక్రమాలతో కంటోన్మెంట్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది. ప్రతిపక్ష కాంగ్రెస్ లోనూ లిస్ట్ పెద్దగానే ఉందన్న టాక్ వినిపిస్తోంది. మరికొద్దిరోజుల్లోనే ఎన్నికల ఉన్న నేపథ్యంలో... అధికార బీఆర్ఎస్ నుంచి చాలా మంది నేతలు ఈ టికెట్‌ను ఆశిస్తున్నారు. పార్టీ సీనియర్ నేత గజ్జల నగేశ్ తో పాటు కార్పొరేషన్ ఛైర్మన్ గా ఉన్న మన్నె క్రిశాంక్, శ్రీ గణేశ్ తెగ సీరియస్ గా ఫోకస్ చేస్తున్నారు. వీరేకాకుండా... ఎర్రోళ్ల శ్రీనివాస్ కూడా ఇక్కడి టికెట్ ఆశిస్తున్నారన్న టాక్ ఉంది. అయితే సాయన్న వారసులుగా తమకే టికెట్ ఇవ్వాలని...ఆయన కుమార్తెలు నందిత, నివేదితలు కూడా కోరుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్ గా ఉంటూ... కేడర్ కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. టికెట్ ఆశిస్తున్న నేతలు... పోటాపోటీగా కార్యక్రమాలు చేస్తున్నారు. మన్నె క్రిశాంత్ బస్తీ నిద్రలు కూడా చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష కాంగ్రెస్ లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కంటోన్మెంట్ టికెట్ తమకంటే తమకు ఇవ్వాలన్నట్లు లెక్కలు వేసుకుంటున్నారట..! ఇక్కడ్నుంచి పోటీ చేసేందుకు సర్వే సత్యనారాయణ రేసులో ఉండగా... కొత్త నేతలు కూడా తమ పేర్లను పరిశీలించాలని హైకమాండ్‌ను కోరుతున్నారని తెలుస్తోంది. మాజీ మంత్రి గీతారెడ్డి కూడా ఇక్కడ్నుంచే పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. వీరికితోడు... అద్దంకి దయాకర్ కూడా టికెట్ దిశగా పావులు కదుపుతున్నారని సమాచారం. వీరే కాకుండా... ఇటీవలే బీఆర్ఎస్ ను వీడి పొంగులేటితో కలిసి కాంగ్రెస్ లో చేరిన విద్యార్థి నేత పిడమర్తి రవి ఈ టికెట్ పై చాలా ఆశలు పెట్టుకున్నారు. వీరే కాకుండా... ఎస్సీ సామాజికవర్గానికి చెందిన పలువురు నేతలు కూడా కంటోన్మెంట్‌లో పాగా వేయాలని ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. మొత్తంగా ఎన్నికల సమీపిస్తున్న వేళ కంటోన్మెంట్‌లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఆసక్తికరంగా మారింది. ఐదుసార్లు ఇక్కడ్నుంచి ప్రాతినిధ్యం వహించిన సాయన్న కుటుంబానికే బీఆర్ఎస్ టికెట్ దక్కుతుందా లేక కొత్త నేతలకు ఛాన్స్ ఇస్తుందా అనేది కూడా చర్చనీయాంశంగా ఉంది. ఇక ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి ఎవరికి టికెట్ ఖరారు అవుతుందనేది చూడాలి...!

## మణిపూర్‌లో
# కొనసాగుతున్న లూటీలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయుధాగారంపై దాడి చేసి భారీ సంఖ్యలో ఆయుధాలను లూటీ చేసింది. బిష్ణుపూర్ జిల్లా నారన్ సైనాలో ఉన్న 2వ ఇండయా రిజర్వ్ బెటాలియన్ (ఎఞః) ప్రధాన కేంద్రంపై తాజా దాడి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఏకే 47, ఘాతక్ వంటి అత్యాధునిక రైఫిల్స్, వివిధ రకాల తుపాకుల్లోని 19 వేలకు పైగా బుల్లెట్లు అపహరించారు. ఏకే, ఘాతక్ రైఫిళ్లు, 195 సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్, 16 9ఎఎ పిస్టల్స్, 25 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, 21 కార్బైన్స్, 124 హ్యాండ్ గ్రేనేడ్లు, 5.56ఎఎ ఇన్సాస్ రైఫిళ్లు, ఐదు 5.56ఎఎ ఇన్సాస్ ఒఓఉలు, ఎక్కువ మొత్తంలో ఓఖ5లు, 9ఎఎ క్యాలిబర్ 16 పిస్టళ్లు, 7.62ఎఎ ాఒఖీల 195 తుపాకులు, 21 ాఓఅ కార్బైన్లు, మూడు 7.62ఎఎ ఒఓఉ, 4 ఒఓఉలు, ఒక ఓఉ3 కార్బైన్ ఉఈ రైఫిళ్లు, రెండు .22 రైఫిల్స్, మూడు 51ఎఎ, ఎనబై ఒకటి 51ఎఎ ఊఇ బాంబులు, 24 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, 23 కెవ్లర్ బాడీ ఆర్మర్, 115 బయోనెట్ లు, 16,245 రౌండ్ల మిశ్రమ మందుగుండు సామగ్రినితో పాటు వివిధ తుపాకులకు చెందిన 19 వేల బుల్లెట్లును లూటీ చేసినట్లు బెటాలియన్ కేంద్రం అధికారులు వెల్లడించారు. దుండగులు.. 40 నుంచి 45 వాహనాల్లో మిగతా వారు కాలినడకన వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9.45 గంటలకు 2వ ఐఆర్బీ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నట్లు వెల్లడించారు. ఈ దుండగులు బిష్ణుపూర్ జిల్లాలోని క్రైరెన్ ఫాబి, తంగలవాయి పోలీసు ఔట్ పోస్టుల నుంచి మరికొన్ని ఆయుధాలు, బుల్లెట్లు లూటీ చేశారు. మరోవైపు రాష్ట్ర రాజధాని ఇంఫాల్ లోనూ రెండు ఆయుధ కేంద్రాలపై దాడి చేశారని, ఆయుధాలు లూటీ చేసేందుకు విఫల యత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఈ విధంగా మణిపూర్ రాష్ట్రంలోని 37 ప్రాంతాల్లో సుమారు 5 వేల ఆయుధాలను దుండగులు అపహరించినట్లు అధికారుల అంచనా. వీటిలో ఎల్ఎంజీ, ఎంఎంజీ, ఏకే, ఇన్సాస్, అసాల్ట్ రైఫిల్స్, ఎంపీ 5, స్నైపర్, కార్బైన్ లు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. మరో వైపు మణిపూర్ అల్లర్లలో చనిపోయిన వారి మృతదేహాలకు గిరిజన నాయకుల వేదిక (ఎఇఉఈ) తలపెట్టిన అంత్యక్రియల యాత్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. చురచంద్‌పూర్ వైపు ర్యాలీ చేపట్టేందుకు ప్రయత్నించగా ఘర్షణ మొదలైంది. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి ఖనన ప్రదేశానికి గిరిజనులు ప్రదర్శనగా వెళ్తుండగా భద్రతా బలగాలు వారిని అడ్డుకున్నాయి. గిరిజనులు ప్రతిఘటించడంతో భద్రతా బలగాలు భాష్పవాయు గోళాలు ప్రయోగించాల్సి వచ్చింది. దీంతో బిష్ణుపూర్ జిల్లాలోని కంగ్వాయి, ఫౌగక్చావోలలో మరోసారి ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. ఈ ఘర్షణల్లో పదుల సంఖ్యలో స్థానికులు గాయపడ్డారు. దీంతో అంతిమ సంస్కార కార్యక్రమాలకు కేంద్రం వినతి మేరకు వారం పాటు వాయిదా వేసుకున్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో
## బెటర్ డెవలప్‌మెంట్ అని నిరూపిస్తే..
# మంత్రి పదవికి రాజీనామా చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

స్వల్పకాలిక చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిని కేటీఆర్ వివరించారు. దేశంలో ఇంటింటికి మంచినీళ్లు ఇచ్చిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ. ప్రపంచంలో అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తెలంగాణలో ఉంది. దేశంలో వరి ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్ స్టేట్ తెలంగాణ. ఇండియాలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న స్టేట్ తెలంగాణ. దేశంలో 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఒకేఒక్క రాష్ట్రం తెలంగాణ. బీడీ కార్మికులకు జీవనభృతి ఇస్తున్న ఒకేఒక్క రాష్ట్రం తెలంగాణ. ప్రపంచంలో ఎకరానికి రూ. 10 వేల పెట్టుబడి ఇచ్చే రాష్ట్రం తెలంగాణ. రైతులకు జీవిత బీమా ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ. లక్షా నూట పదహార్ల కానుక ఇచ్చి 13 లక్షల మంది ఆడబిడ్డల పెళ్లిళ్లు చేసిన రాష్ట్రం తెలంగాణ. ఇండియాలో ఐటీ ఉద్యోగాలు అత్యధికంగా కల్పించిన రాష్ట్రం తెలంగాణ. అందుకే అంటున్నా.. జై తెలంగాణ అని. అది మా పనితనం. మీలాగా ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పాం. భట్టి విక్రమార్క, రఘునందన్ రావుకు సవాల్ చేస్తున్నా. నేను చెప్పింది తప్పయితే.. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ కంటే బెటర్‌గా ఉందని రుజువు చేస్తే రేపు పొద్దున ఫస్ట్ అవర్‌లో నా మంత్రి పదవికి రాజీనామా చేస్తాను. ఇది మా ధైర్యం. ఉన్నది ఉన్నట్టు ఒప్పుకోవడానికి సిగ్గేందుకు అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రణరంగంగా న్యూయార్క్ నగరం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఓ ఇన్‌ఫ్లుయెన్సర్ చేసిన ప్రకటన కారణంగా న్యూయార్క్ నగరం రణరంగంగా మారింది. తన అభిమానులకు బహుమతులు ఇస్తానన్న ప్రకటనతో వేలాది మంది తరలి వచ్చారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. న్యూయార్క్‌కు చెందిన 21 ఏళ్ల కై సెనాట్ అనే యూట్యూబర్‌కు అక్కడ మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ నేపథ్యంలో అతను తన ఇన్ స్టాగ్రామ్ పేజిలో ఓ పోస్ట్ పెట్టాడు. మన్ హటన్ యూనియన్ స్క్వేర్ పార్క్ లో శుక్రవారం సాయంత్రం లైవ్ స్ట్రీమింగ్ ఈవెంట్ చేయనున్నట్లు అందులో పేర్కొన్నాడు. అంతేకాదు అభిమానులను నేరుగా కలుస్తానని, వారికి ప్లే స్టేషన్ 5 గేమ్ కన్సోల్స్ సహా పలు బహుమతులు ఇస్తానని ప్రకటించారు. ఇది చూసిన అభిమానులు మన్ హటన్ పార్క్‌కు వేలాదిగా తరలివచ్చారు. వీరిని అదుపు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది.

## సంపాదకీయం

### ఎలక్షన్ మూడ్ లో తెలుగు రాష్ట్రాలు

షెడ్యూలు ప్రకారం జరిగితే ఏపీ, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల మధ్య ఆరు నెలల గ్యాప్ వుండాలి. దాని ప్రకారమే రాజకీయం కొనసాగాలి. కానీ అటు ఏపీలో, ఇటు తెలంగాణలో రాజకీయ పార్టీలు మరీ ముఖ్యంగా అధికార పార్టీల దూకుడు చూస్తుంటే కొన్ని నెలల ముందే ఎన్నికలకు అధికార పార్టీలు సమాయత్తమవుతున్నాయన్న అభిప్రాయం కలుగుతోంది. తెలంగాణలో నవంబర్, డిసెంబర్ నెలల్లో ఎన్నికలు జరగాలి కాబట్టి సహజంగానే అధికార, ప్రతిపక్ష పార్టీలు దానికి అనుగుణంగా వ్యూహాలు రచిస్తున్నాయనుకోవచ్చు. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు చాలా ముందుగానే ఎన్నికల నగారా మోగించాయనే చెప్పాలి. అసెంబ్లీకి రానని భీష్మించుకున్న విపక్ష నేత చంద్రబాబు రాజకీయాల్లో యాక్టివ్‌గా వుండేందుకు జిల్లాల పర్యటనలను ఎంచుకున్నారు. ఆయన తనయుడు నారా లోకేశ్ దాదాపు ఏడు నెలల క్రితమే పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం లోకేశ్ పాదయాత్ర పల్నాడు జిల్లాలో కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల చరిత్రలో సుదీర్ఘ కాలం, సుదూరం కొనసాగిన పాదయాత్రగా లోకేశ్ యువగళం నిలిచిపోయేలా వుంది. ఎందుకంటే ఆయన దాదాపు నాలుగు వేల కిలోమీటర్ల దూరం నడుస్తున్నారు. తాజాగా పది రోజుల నుంచి చంద్రబాబు కూడా తన పర్యటనల్లో వేగం పెంచారు. తనను వృద్ధ నేతగా సీఎం జగన్మోహన్ రెడ్డి పోల్చడాన్ని ఆక్షేపిస్తున్న చంద్రబాబు వయసు మీద పడ్డా తనలో వేగం తగ్గలేదన్నట్లుగా పర్యటనలు చేస్తున్నారు.

తాజాగా వైఎస్ జగన్ కుటుంబానికి ఆయువు పట్టైన పులివెందులలో పర్యటించిన చంద్రబాబు " వై నాట్ పులివెందుల " అన్న నినాదాన్ని వినిపించారు. అక్కడ్నించి టీడీపీ నేత బీటెక్ రవిని అభ్యర్థిగా ప్రకటించారు. జనసేన పార్టీ కూడా చాలా ముందుగానే ఏపీలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిందని చెప్పాలి. జూన్ నెలలోనే పవన్ కల్యాణ్ వారాహి విజయయాత్ర పేరిట ప్రత్యేక వాహనంలో జిల్లాల పర్యటన ప్రారంభించారు. ఇప్పటికే రెండు విడతల వారాహి విజయ యాత్ర పూర్తి కాగా.. మూడో విడత యాత్రను ఆగస్టు 10న విశాఖపట్నంలో ప్రారంభించి, 19వ తేదీ దాకా నిర్వహించాలని పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. ఇంకోవైపు తమ ట్రెడిషన్‌ను పక్కన పెట్టేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా స్వర్గీయ ఎన్టీఆర్ కూతురు, మాజీ కేంద్ర మంత్రి పురంధేశ్వరిని ఎంచుకుంది. ఆర్ఎస్ఎస్ భావజాలంతో ముడిపడి వుంటే నేతలకు అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టే ట్రెడిషన్‌ని బీజేపీ బ్రేక్ చేసింది. చరిష్మా కలిగిన నేత సారథిగా వుంటే మేలని బీజేపీ భావించింది. విపక్షాల హడావిడి పెరిగిపోవడంతో అధికార పార్టీ కూడా మెల్లిగా ఎన్నికల దిశగా అడుగులు వేయడం ప్రారంభించింది. నిజానికి గత రెండు నెలలుగా ఏపీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారంలో రెండు, మూడు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రారంభిస్తూనో, శంకుస్థాపనలు చేస్తూనో ప్రజల్లో తిరుగుతున్నారు.

గత నాలుగేళ్ళలో తమ ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తున్నారు. తాజాగా వైఎస్సార్సీపీ నియోజక వర్గాల పరిశీలకులతో జగన్ నమ్మిన బంటు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి భేటీ అవడంతో అధికార పార్టీ కూడా ఎన్నికల సన్నాహాలను ప్రారంభించినట్లయ్యింది. గ్రౌండ్ లెవెల్లో పార్టీ పరిస్థితిని తెలుసుకునేందుకు, పార్టీలో అంతర్గత గ్రూపులను రూపు మాపి, అంతా ఒక్క తాటి మీద నడిచేందుకు సజ్జల రామకృష్ణారెడ్డి 175 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిశీలకులతో సమావేశమయ్యారని చెబుతున్నారు. అయితే, ఇక్కడ ఓ అంశం ప్రస్తావనార్హంగా కనిపిస్తోంది. కొన్ని నెలల క్రితం జగన్.. " వై నాట్ 175 " అన్న నినాదాన్ని వినిపించారు. ఇక తెలంగాణలో నవంబర్, డిసెంబర్ నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగడం ఖాయం. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. నిజానికి గత సంవత్సరం నుంచి ముందస్తుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రెడీ అవుతున్నారని విపక్షాలు భావిస్తున్నాయి. 2018లో అనూహ్య నిర్ణయం ద్వారా ముందస్తుకు వెళ్ళి కేసీఆర్ విపక్షాలకు షాకిచ్చారు. ఇంకా చెప్పాలంటే ప్రతిపక్షాలను క్లీన్ బౌల్డ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ 19 మంది ఎమ్మెల్యేలకే పరిమితమై చతికిలా పడింది. బీజేపీ అయితే మరీ ఘోరంగా ఒక్క సీటుకే పరిమితమైంది. ఆ తర్వాత కాలంలో గులాబీ ఆకర్షతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో మూడింట రెండొంతుల మంది కేసీఆర్ పార్టీకి మారిపోగా.. కేవలం 6 ఎమ్మెల్యేలతో సీఎల్పీ అసెంబ్లీలో మూడో స్థానానికి పడిపోయింది. బీజేపీ మాత్రం రెండు ఉప ఎన్నికల్లో సానుకూల ఫలితాలను రాబట్టుకుని ఎమ్మెల్యేల నెంబర్‌ని మూడుకు పెంచుకుంది. కానీ, తొలుత సింగిల్‌గా బీజేపీ తరపున గెలిచిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. తన నోటి దురుసుతో పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురికాగా.. ప్రస్తుతం శాసనసభలో బీజేపీ సభ్యుల సంఖ్య రెండుగా కొనసాగుతోంది. మరోవైపు తెలంగాణలోని మొత్తం 119 సీట్లలో మూడొంతుల అసెంబ్లీ సీట్లు కలిగిన ఏరియాలకు మెట్రో రైలును విస్తరిస్తామని ప్రకటించారు. మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుని, తన తనయుడు, మునిసిపల్ మంత్రి కేటీరామారావు చేత ప్రకటింపచేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. ప్రస్తుతం 69.6 కి.మీ.ల దూరం మాత్రమే మెట్రో రైలు నడుస్తోంది. పాతబస్తీలోకి ఫలక్‌నుమా దాకా 5.5 కి.మీ.లు పూర్తయ్యే ప్రక్రియ కొనసాగుతోంది.

గత సంవత్సరం డిసెంబర్ నెలలో రాయదుర్గం–శంషాబాద్ ఎయిర్ పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రోకు సీఎం శంకుస్థాపన చేశారు. ఇదింకా పూర్తిస్థాయిలో పట్టాలెక్కక ముందే ఏకంగా మొత్తం 415 కిలో మీటర్ల మేరకు మెట్రో రైలును వచ్చే నాలుగేళ్ళలో విస్తరిస్తామని కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించింది. అంటే కొత్త జిల్లాల పరిధి మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, భువనగిరి యాదాద్రి, సంగారెడ్డి జిల్లాలకు మెట్రో రైలు విస్తరించనున్నది. ఆచరణలో ఇది ఏమేరకు సాధ్యమనేది పక్కన పెడితే.. కేసీఆర్ ఎన్నికలకు పూర్తిస్థాయిలో రెడీ అవుతున్నారన్నది మాత్రం ఈ ప్రకటనతో తేటతెల్లమైంది. దానికి తోడు వికలాంగుల పెన్షన్ మొత్తాన్ని మూడు వేల నుంచి నాలుగు వేల రూపాయలకు పెంచుతూ ఇదివరకే ఓ ప్రకటన చేశారు.


ఎన్నికల దిశగా కేసీఆర్ మరో కీలక నిర్ణయం.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకోవడం. ఆర్టీసీ కార్మికులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్న ఈ విలీనంపై తాజాగా కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. టీఎస్ఆర్టీసీలో పని చేస్తున్న మొత్తం 43 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చబోతున్నారు. ఇదే క్రమంలో మరింత వేగంగా మరికొన్ని ప్రజాకర్షక పథకాలను కేసీఆర్ ప్రకటించబోతున్నట్లుగా సమాచారం. కాంగ్రెస్ పార్టీ కూడా కర్నాటకలో ఫలించిన ఉచిత హామీల వ్యూహంతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది.

# టమోటే కాదు...కూరలు, పప్పులు కూడా పైపైకే



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : టమాటా ధర ఇంకా ఆకాశంలోనే విహరిస్తోంది. రోజుకో రికార్డు నమోదు చేస్తూ మరింత ఎత్తుకు ఎదుగుతుందే తప్పా.. ఇప్పట్లో దిగరానని మొండికేస్తోంది. దేశవ్యాప్తంగా తీవ్రమైన వర్షాలు కురవడంతో చాలా వరకు పంట ధ్వంసమైంది. దీంతో దిగుబడి తక్కువగా, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఇప్పట్లో టమాటా ధర తగ్గే సూచనలు కనిపించడం లేదు. అయితే కేవలం టమాటా మాత్రమే కాకుండా మిగతా కూరగాయల ధరలు కూడా సామాన్యులకు ఏమాత్రం అందుబాటులో లేవు. చాలా రకాల కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఆలూ మినహా ఇతర ప్రధాన ఆహార పదార్థాల ధరలు గణనీయంగా పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఏడాది కాలంలో పప్పు ధరలు గరిష్ఠంగా 28 శాతం పెరిగాయని, ఆ తర్వాత బియ్యం 10.5 శాతం, ఉరద్ పప్పు, ఆటా 8 శాతం పెరిగినట్లు ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ వారం పార్లమెంటుకు తెలిపింది. బియ్యం సగటు చిల్లర ధర ఏడాది క్రితం రూ.37 ఉండగా, గురువారం కిలో రూ.41గా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. దేశీయంగా ఉత్పత్తి తగ్గడమే పప్పు ధర పెరగడానికి కారణమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2022–23 పంట సంవత్సరానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఇచ్చిన మూడో ముందస్తు అంచనా ప్రకారం గత పంట సంవత్సరంలో 42.2 లక్షల టన్నుల పప్పు ఉతప్పతి 34.3 లక్షల టన్నులకు పడిపోయినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధరల పర్యవేక్షణ సెల్ ప్రకారం, గురువారం నాడు పప్పు సగటు రిటైల్ ధర కిలోకు 136గా ఉంది. గత ఏడాది కిలో రూ.106.5గా ఉండేది. గత ఏడాది రూ.106.5 గా ఉన్న మినపప్పు కిలో ధర రూ.114కి పెరిగింది. పెసర పప్పు కూడా రూ.102 నుంచి రూ.111 కి పెరిగింది. కూరగాయల్లో.. ఆలూ సగటు రిటైల్ ధర గతేడాది కంటే 12 శాతం తక్కువగా ఉండగా, ఉల్లి ధర గత ఏడాది కంటే 5 శాతం ఎక్కువగా ఉన్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. టమాటా ధరలపై మంత్రిత్వ శాఖ మాట్లాడుతూ.. పంట కాలానుగుణత, తెల్ల ఈగ వ్యాధి, ఉత్తరాది రాష్ట్రాల్లో అధిక వర్షాల కారణాల వల్ల పంట దిగుబడి లేక టమాటా ధరలు పెరిగినట్లు చెప్పుకొచ్చింది. హర్యానా, హిమాచల్ ప్రదేశ్ లలో టమాటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, భారీ వర్షాల కారణంగా చాలా ప్రాంతాల్లో లాజిస్టిక్స్ లో సమస్యలు ఎదురైనట్లు వెల్లడించింది. ఆగస్టు 3న వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం ఢిల్లీలో టమాటా ధర రూ. 213కి పెరిగింది. దేశ రాజధానిలో సగటు టమాటా ధర జులై 20 నాటికి కిలో రూ.120కి తగ్గింది. ఆగస్టు 3న దేశవ్యాప్తంగా టమాటా సగటు ధర రూ.140.1గా ఉండగా, 2వ తేదీ రూ.137.06గా ఉంది. 1న సగటు ధర రూ.132.5 కాగా.. వారం రోజుల క్రితం సగటు ధర కిలో రూ.120గా ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో ఆగస్టు 2న టమాటా కిలో రూ. 263కు విక్రయించబడింది. ఇది దేశంలోనే అత్యధిక ధరగా రికార్డ్ అయ్యింది. ఈ వివరాలు టమాటా ధరలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో వివరిస్తోంది. మరికొన్ని రోజుల్లో కిలో రూ. 300కు చేరుకోవచ్చని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. భారీ వర్షాలతో దిగుబడి, దిగుమతి తగ్గిపోయిందన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడటం, భారీ వర్షాల కారణంగా కూరగాయల రవాణా కష్టంగా మారిందని ఆజాద్‌పూర్ మండికి చెందిన హోల్‌సేల్ వ్యాపారి సంజయ్ భగత్ తెలిపారు. కొండ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

# ఐటీలో హైదరాబాద్ నెంబర్ వన్



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :

కేసీఆర్ సమర్థవంతమైన నాయకత్వం వల్లే ఐటీ అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతోందని కేటీఆర్ ప్రకటించారు. దేశంలో ఉన్న ఐటీ పురోగతితో పోలిస్తే మన ఐటీ పురోగతి నాలుగు రెట్లు ఎక్కువగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు? శాస నసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఐటీ ఎగు మతులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో 1987లో మొట్ట మొదట ఐటీ టవర్ వచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు.. 27 సంవత్సరాల్లో ఐటీ రంగాల్లో రూ. 56 వేల కోట్లు ఐటీ ఎగుమతులు మాత్రమే నని, కానీ గతేడాది తెలంగాణ ప్రభుత్వం ఐటీ రంగంలో రూ. 57,707 ఐటీ ఎగుమతులు సాధించిందని పేర్కొన్నారు. ఇది సమర్థత గల ప్రభుత్వంతోనే సాధ్య మవు తుందన్నారు. 2022–23లో ఐటీ ఎగు మతులు 31.4 శాతం పెరిగాయని, ప్రముఖ ఐటీ కంపెనీలు హైద రాబాద్‌కు వచ్చాయని పేర్కొన్నారు. కొత్త రాష్ట్రం వచ్చాక 6 లక్షలకు పైగా ఐటీ ఉద్యోగాలు వచ్చాయని, . ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమలను విస్తరిస్తోందన్నారు. ఇప్పటికే చాలా నగరాల్లో ఐటీ కంపెనీలు ప్రారంభ మయ్యాయని తెలిపారు. తెలంగాణలో మతాల పంచాయతీ లేదు, కులాల మధ్య కొట్లాట లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. స్టేబుల్ గవర్నమెంట్.. ఏబుల్ లీడర్‌షిప్ వల్లే ఇదంతా సాధ్యం అయిందని విజ్ఞప్తి చేస్తున్నాను. గురుగ్రామ్‌లో ఐటీ పరిశ్రమను నాశనం చేస్తున్నారు. మణిపూర్‌లో తెగల మధ్య కొట్లాట పెట్టారని విమర్శించారు. దేశంలో మొత్తం సృష్టించిన టెక్నాలజీ జాబ్స్‌లో 44 శాతం తెలంగాణవే అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో భూముల రేట్లు బాగా పెరుగుతున్నాయి. ఇవాళ ఎకరం ధర రూ. 100 కోట్లు పలుకుతోంది అని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యులు లేకపోవడంపై కేటీఆర్ మండిపడ్డారు. శాసనసభ సమావేశాలు 30 రోజులు జరపాలని బీజేపీ నాయకుడు ఉత్తరం రాశారని కాంగ్రెసోళ్లేమో 20 రోజులు జరపాల్నారు. కానీ ప్రశ్నోత్తరాల సమయంలో మేమందరం ఉన్నాం.. కానీ కాంగ్రెస్, బీజేపీల నుంచి ఒకరి చొప్పున మాత్రమే సభలో ఉన్నారని విమర్శించారు. దీన్ని బట్టి వీరికి ప్రజల మీద ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలుస్తుంది. ప్రజల పట్ల వీరికున్న ప్రేమ, అభిమానం తెలుస్తుంది. బయటనేమో డైలాగులు.. 20 రోజులు కావాలి.. 30 రోజులు కావాలి అని. కానీ 30 నిమిషాలు కూర్చొనే ఓపిక లేదు వీళ్లకు. వీళ్లను ప్రజలు కూడా గమనిస్తున్నారు. వీళ్ల సంగతేందో ప్రజలే చూసుకుంటారని కేటీఆర్ పేర్కొన్నారు.

# తెలంగాణలోనే మార్గదర్శి కేసులు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : మార్గదర్శి కేసులో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు నుంచి ఏపీకి కేసుల బదిలీకి సుప్రీంకోర్టు నిరాకరించింది. కేసులను విచారించే న్యాయపరిధి తెలంగాణ హైకోర్టుక లేదంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్ ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. న్యాయపరిధి విషయాన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన బదిలీ పిటీషన్లు కాలం చెల్లినవని చెప్పిన సుప్రీంకోర్టు ...మార్గదర్శి ఎండి శైలజాకిరణ్ పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. మెరిట్స్ ఆధారంగా ఈ కేసును విచారించి నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టుకు సూచన మెరిట్స్ ఆధారంగా ఈ కేసును విచారించి నిర్ణయం తీసుకోవాలన్న జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ కెవి విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం తెలంగాణ హైకోర్టుకు సూచించింది. మెరిట్స్ ఆధారంగా కేసును విచారించి తీర్పును వెలువరించే స్వేచ్ఛను తెలంగాణ హైకోర్టుకే ఇచ్చింది. మార్గదర్శి చిట్‌ఫండ్ కేసు బదిలీపై ఏపీ ప్రభుత్వం పిటిషన్లపై విచారణ అవసరం లేదని.. విచారణ నిర్ణయం ఇప్పటికే జరిగినందున మళ్లీ విచారణ అవసరం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. చెప్పాలనుకున్న విషయాలన్నీ తెలంగాణ హైకోర్టు ముందు చెప్పండని ఏపీ న్యాయవాదులకు సూచించింది. తెలంగాణ హైకోర్టు తుది ఆదేశాలు ఇచ్చాక రావచ్చని సుప్రీంకోర్టు ఏపీ న్యాయవాదులకు స్పష్టం చేసింది. వాదనల సందర్భంగా చిట్ ఫండ్ పేరుతో నిధులను సేకరించి దారి మళ్ళించారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు ఏపీ ప్రభుత్వ న్యాయవాది. అలాగే.. ఆంధ్రప్రదేశ్ లోనే నేరం జరిగిందని, కాబట్టి.. కేసులన్నింటినీ ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని వాదించారు. చిట్ ఫండ్ నిధులను హైదరాబాదు నుంచి మ్యూచువల్ ఫండ్ లోకి తరలించారని వాదించారు మార్గదర్శి తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి. కాజ్ ఆఫ్ యాక్షన్ హైదరాబాద్‌లోనే ఉంది కనుక తెలంగాణలోనే విచారణ జరపాలని వాదించారు. చివరికి ఏపీ ప్రభుత్వ పిటిషన్లను ధర్మాసనం తోసిపుచ్చింది. మార్గదర్శి చిట్ పండ్స్ కేసుల విషయంలో ఏపీ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోంది. ఒక్క ఫిర్యాదుదారు లేనప్పటికీ సంస్థ అవకతవకలకు పాల్పడుతోందని నగదు మళ్లిస్తోందని ఆరోపిస్తూ.. సోదాలు నిర్వహించారు. అలాగే చిట్స్ ను మూసే యడానికి,చందాదారులకు బహిరం గనోటీసులు జారీ చేశారు. రాజకీయంగా కుట్ర చేసి వ్యాపార సంస్థను మూసి వేయడానికి జరుగుతున్న కుట్రగా మార్గదర్శి ఆరోపిస్తోంది.

# ఎంబీబీఎస్ కోసం తెలంగాణకు ఏపీ విద్యార్థులు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : ఎంబీబీఎస్ చదువు కోసం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పెద్ద ఎత్తున తెలంగాణకు వస్తున్నారన్నారని మంత్రి హరీష్ రావు అన్నారు. శాసనమండలిలో మంత్రి మాట్లాడుతూ.. ఏపీలోని పాత ఐదు మెడికల్ కాలేజీల్లోనే ఆంధ్రా విద్యార్థులకు 15 శాతం సీట్లు వస్తున్నాయని అన్నారు. కొత్తగా ఏర్పాటైన 26 మెడికల్ కాలేజీల్లో 100 శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఉస్మానియా ఆసుపత్రిని అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తామని ప్రకటించారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై ప్రభుత్వం హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించిందని తెలిపారు. విధుల్లో చేరిన ప్రభుత్వ వైద్యులకు ప్రైవేట్ ప్రాక్టీస్‌పై నిషేధం విధించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో కొత్తగా ఎనిమిది మెడికల్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. సీఎం కేసీఆర్ వైట్, పింక్, గ్రీన్, బ్లూ విప్లవం తీసుకొచ్చారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, టీడీపీలు 60 ఏళ్లలో 2 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, కేసీఆర్ సర్కార్ తొమ్మిదేళ్లలో 29 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు. దేశంలోని మొత్తం ఎంబీబీఎస్ సీట్లలో 43 శాతం తెలంగాణ విద్యార్థులు సాధిస్తున్నారు.

## నష్టపోయిన మత్స్య కార్మికులను ఆదుకోండి



**పెద్దపల్లి – ప్రభాత సూర్యుడు :** భారీ వరదల కారణంగా నష్ట పోయిన మత్స్యశాఖ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్, బల్ల సత్తయ్య, మహబూబాబాద్ జిల్లా ప్రచార కార్యదర్శి దుండి వెంకటేశ్వర్లు మత్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ని కోరారు. భారీ వర్షాలకు చెరువులలో వరద ఉధృతి పెరిగి అలుగుల ద్వారా చేపలు వెళ్లిపోవడంతో ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. శనివారం శాశనమండ లిలో మంత్రిని కలిసిన అనంతరం వారు మాట్లాడు తూ మహబూ బాబాద్ జిల్లాలోని మత్స్యకార్మికు లను ఆదుకోవాలని అలాగే రాష్ట్రములోని 29,469 చెరువుల రిజర్వాయరు లలో, దాదాపు 15006 టన్నుల చేపలు అలుగుల ద్వారా గోదావరి, కృష్ణ నదులలో వెళ్లిపోవడం జరిగిందని దీనివల్ల సుమారు రూ.15 వందల కోట్ల వరకు నష్టం జరిగిందని తెలిపారు. ఈ నష్టాన్ని పూర్చేందుకు తగిన విధంగా సహకరించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఉన్నత స్థాయిలో దీనిపై సమగ్రమైన విచారణ జరిపి రాష్ట్రములోని మత్స్యకార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దానికి స్పంది ంచిన మంత్రి తగిన సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపార న్నారు. మంత్రి ని కలిసిన వారిలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్, బల్ల సత్తయ్య, మహబూబాబాద్ జిల్లా ప్రచార కార్యదర్శి దుండి వెంకటేశ్వర్లు, ముదిరాజులు ఉన్నారు.

## జీడిమెట్ల డిపోముందు ఆర్టీసీ కార్మికుల ధర్నా

**మేడ్చల్ – ప్రభాత సూర్యుడు :** ఆర్.టి.సి ఎంప్లాయిస్ ని ప్రభుత్వం లో విలీనం చేస్తూ రాష్ట్ర సియం కేసిఆర్ తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర గవర్నర్ మోకారిల్లడాన్ని నిరసిస్తూ జీడిమెట్ల డిపోముందు ఆర్.టి.సి ఎంప్లాయిస్ 91బస్సు సర్వీస్ లను నిలిపివేస్తూ ధర్నాకు దిగారు. ఈ దర్నాకు అన్ని ఆర్.టి.సి యూనియన్‌లు మద్దతు తెలుపుతున్నాయి.. తెలంగాణ మజ్దూర్ యూనియన్,ఎంప్లాయిస్ యూనియన్, ఎస్.డబ్ల్యూ. ఎఫ్,టిజెఎమ్ తదితర యూనియన్స్ ఒకే తాటిపైకి వచ్చి ధర్నాను కొనసా గిస్తున్నాయి. ఆర్.టి.సి ఎంప్లాయిస్ ని కడుపులో పెట్టుకుని చూసే తెలంగాణ గవర్నమెంటు పంపిన గవర్నర్ అమోదం బిల్లుపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న గవర్నర్ వెంటనే అమోదం బిల్లుపై సంతకం పెట్టి ఆర్.టి.సి ఎంప్లాయిస్ పట్ల విజ్ఞత చాటుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్ ఆర్ డిజి స్కూల్ లో అమానుషం

### విద్యార్థిని తో అసభ్యంగా ప్రవర్తించిన పీఈటీ

**రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో దారుణం జరిగింది. అత్తాపూర్ ఎస్ ఆర్ డిజి స్కూల్ లో 8 తరగతి విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తన ఘటన వెలుగులోకి వచ్చింది. పీఈటీ విష్ణు ఒక విద్యార్థిని తో అసభ్యంగా ప్రవర్తించి, దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. విద్యార్థినికి ఫోన్లు చేసి ఇబ్బంది పెట్టాడు. విషయం తల్లిదండ్రులకు విద్యార్థిని చెప్పింది. స్కూల్ వద్దకు చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, స్కూల్ లో ఉన్న ఫర్నీచర్ ధ్వంసం చేసారు. కంప్యూటర్ రూమ్ ను పగలగొట్టారు.స్కూల్ లో ఉన్న ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయుల పై దాడి చేసారు.పీఈటీ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పారిపోయాడు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో విద్యార్థిని తల్లిదండ్రులు పిర్యాదు చేసారు.

## డిపో ముందు ఆర్టీసీ కార్మికుల నిరసన

**నాగర్ కర్నూలు – ప్రభాత సూర్యుడు :** రాజకీయ కక్ష సాధింపుతోనే ఆర్టీసీ కార్మికుల బిల్లు ఆమోదంపై గవర్నర్ తమిళిసై సంతకం చేయలేదని ఆర్టీసీ కార్మికులు ఆరోపించారు. శనివారం తెల్లవారుజామున అచ్చంపేట ఆర్టీసీ డిపో ముందు కార్మికులు ధర్నాకు దిగారు. దాంతో బస్సులు నిలిచిపోయాయి. బస్ స్టాండ్ కు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బిల్లు అమోదించకపోవడంతో రాజ్ భవన్ ముట్టడిస్తామని ఆర్టీసీ కార్మికులు హెచ్చరించారు.

## ట్రాఫిక్ పోలీస్ డ్రంక్ అండ్ డ్రైవ్

**ఖమ్మం – ప్రభాత సూర్యుడు :** ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ సెంటర్లో ట్రాఫిక్ సిఐ అశోక్ ఆధ్వర్యంలో ఎస్.ఐ రవి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ డ డ్రైవ్ నిర్వహించారు. తాగి వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకొని జరిమానాలు విధించి పంపించారు. ప్రతి రోజు కనీసం పది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఫైల్ చెయ్యాలనే ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రతి రోజు పాత బస్టాండ్ సెంటర్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన వాహనదారుల పై చట్టరీత్యా చర్యలు తీసుకొని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు.

## బిడ్డకు తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



**కోరుట్ల – ప్రభాత సూర్యుడు :** బిడ్డకు తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యమని అంగన్ వాడి సూపర్ వైజర్ ప్రేమలత అన్నారు. శనివారం పట్టణంలోని బోయవాడ కాలనీలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వల్ల శిశువుకు సరైన పోషకాహారం అందుతుందని, రోగనిరోధక వ్యవస్థ మెరుగవుతుందని తద్వారా బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని తెలిపారు. గర్భిణీలకు బాలింతలకు తల్లిపాల వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం శ్రీమంతాలు, అన్నప్రాసన చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జి. రజిత, ఆర్ పి శ్రీదేవి, ఆశావర్కర్ భాగ్యలక్ష్మి, తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

# దళితవాడకు ప్రధానమంత్రి సంక్షేమ పథకాలు

- వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- అచ్చంపేటను ఆగం చేశారు
- బీజేపీ నియోజకవర్గ నాయకులు శ్రీకాంత్ భీమా

**నాగర్ కర్నూలు – ప్రభాత సూర్యుడు :** భారత అవునత్యాన్ని ప్రపంచ దేశాలలో చాటి చెప్పి ..దేశ అభివృద్ధి.. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం ప్రధాని మోదీ జి కృషి చేస్తున్నారు అని బీజేపీ అచ్చంపేట నియోజకవర్గ నాయలు శ్రీకాంత్ భీమా పేర్కొన్నారు.శనివారం ఉప్పునుంతల మండలం మామిల్ల పల్లి గ్రామములోని దళిత వాడాలో పర్యటించి ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు..బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమ కోసం పనిచేస్తుంది అన్నారు..రానున్న ఎన్నికల్లో ప్రజలు బీజేపీ ని గెలిపించి దేశాన్ని కాపాడుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.



మోదీ జి పాలనలో దేశ ప్రజలు ఎంతో సంతోషం గా ఉన్నారని అన్నారు. ఎన్నికల సమయంలో బీఆర్ స్ ఇచ్చిన హామీలను తుంగ్గలో తిక్కి రాష్ట్ర ప్రజలను విస్మరించారని అన్నారు..రైతు ప్రభుత్వమని చెప్పు కోవడమే తప్ప రైతులకు ఒరగబెట్టింది ఏమి లేదని అన్నారు..మళ్ళీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్తూ మళ్ళీ మోసం చేసి గద్దెనెక్కడనికి చూస్తున్నారని విమర్శించారు.. అచ్చంపేట ను అన్ని రకాలుగా అన్యాయానికి గురిచేసారని ఆరోపించారు.. నల్లమల అటవీ ప్రాంతంలో జీవిస్తున్న ప్రజలకు కనీసం విద్య .వైద్యం అందుబాటులో ఉంచని దౌర్భాగ్య స్థితిలో పాలకు ఉన్నారు అని అన్నారు..అచ్చంపేటలో బిజెపి జెండాను ఎగురవేసి ఈ ప్రాంత ప్రజలను కాపాడు కుంటానని తెలిపారు.అంతకు ముందు గ్రామానికి చెందిన యాదయ్య నూతనంగా ప్రారంభించిన సెలూన్ షాప్ లో క్షవరం చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టీ.మహేష్, బలస్వామి, శేఖర్,భాస్కర్,యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ సర్కార్ తోనే పెద్దపల్లి అభివృద్ధి సాధ్యం

-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి

**పెద్దపల్లి – ప్రభాత సూర్యుడు :** బీజేపీ సర్కార్ తోనే పెద్దపల్లి అభివృద్ధి సాధ్యమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల పేరు చెప్పుకొని కొంతమంది రాజకీయ నాయకులు పబ్బం గడుపుకోవడం సిగ్గు చేటని , సిట్టింగ్, మాజీ ఎమ్మెల్యేలు వారి స్వార్థం, సొంత ప్రయోజనాల కోసమే పని చేసి, పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధిని మరిచిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు వేయడం, లైట్లు పెట్టడం అభివృద్ధి కాదని, ప్రజల జీవితాల్లో ఆర్థిక స్వావలంభన తీసుకురావడమే అసలైన అభివృద్ధని తెలిపారు. ప్రజల జీవన విధానంలో మార్పు తేలేని నాయకుల అవసరం లేదని హితవు పలికారు. అత్యధిక రైస్ మిల్లులతో దేశంలోనే రెండవ స్థానం, ఇటుక పరిశ్రమలు, ఇసుక, మట్టి వంటి ఖనిజ సంపద విపరీతంగా ఉన్నా పెద్దపల్లిని అన్ని రంగాల్లో దోచుకోవడం జరిగిందని విమర్శించారు. ఎస్సారెస్పి డి–82, 83 కాలువ



పారుతున్నా నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు రైతులకు ఇప్పటికీ సాగు నీరు ఇవ్వడంలో ఘోరంగా విఫలం అయ్యారని దుయ్యబట్టారు. కార్యకర్తలను కొనడం, అమ్మడం మినహాయించి బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు ఒరగబెట్టినదేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇసుక, మట్టి మాఫియా అంటూ ఊదరగొట్టిన ఇద్దరు నేతలు తదనంతరం ఎందుకు యూటర్న్ తీసుకున్నారని ప్రశ్నించారు. ఇటీవల్ బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్లో చేరిన మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు బిసిల ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డికి తాకట్టు పెట్టారన్నారు. నియోజకవర్గంలో ఒకసారి డబుల్ ఇంజన్ సర్కారుకు అవకాశమి వ్వాలని ప్రజలను సురేష్ రెడ్డి కోరారు. విద్య, వైద్యం, పారిశ్రామిక విధానం అమలు చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామ ని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు మోర మనోహర్, సయ్యద్ ఫయాజ్, కందునూరి ప్రమోద్ కుమార్, ఉనుకొండ తిరుపతి, కల్వల శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి కరుణాకర్, మోసంపల్లి శ్రీధర్, ఉనుకొండ తిరుపతి, జక్కుల శ్రీకాంత్, తూముల రవి తేజ, బాల్త ప్రశాంత్, రేండ్ల వేణు, బాలసాని వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సాధనకై కలెక్టరేట్ ముందు ఏఎన్ఎం ల ధర్నా

- ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలి
- వ్రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలి
- రెండవ ఏఎన్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల మధురిమ, మమతల డిమాండ్

**జగిత్యాల –ప్రభాత సూర్యుడు :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి 9 ఏళ్ళ దాటినా ఈవిషయాన్ని పట్టించుకోవడం లేదని తెలంగాణ ఉమేన్ ఏఎన్ఎం అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాండ్ల మధురిమ, పడాల మమతలు మండిపడ్డారు.రెండవ ఏఎన్ఎంల న్యాయమైన డిమాండ్లను పరిష్క రించాలని చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో 3 వేల మందిని అరెస్ట్ చేసినందుకు నిరసనగా జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ముందు మధురిమ, మమతల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మధురిమ, మమతలు మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఒకటవ ఏఎన్ఎం లకు సమానంగా విధులు నిర్వహిస్తున్న, ఉద్యోగ భద్రత లేదని, మమ్మల్ని ఎన్హెచ్ఎం, కాంట్రాక్ట్ ఉద్యోగులని చిన్న



చూపు చూస్తున్నారని వాపోయారు. కోవిడ్ సమయంలో కుటుంబాలకు దూరంగా ఉండి సేవాలాందించామని, వివిధ రకాల వైద్య సేవలు అందిస్తున్న మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మా జీతాలను ఇప్పుడున్న కనీస జీవన వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని ఎంపిహెచ్డబ్ల్యూ ( మెల్ )లతో సమానంగా వేతనాలు చెల్లించాలని మధురిమ, మమతలు కోరారు.ఏలాంటి వ్రాత పరీక్ష లేకుండా మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పద్ధతినా పనిచేసిన జూనియర్ లెక్చరర్లను, విఆర్ఏలు, ఆర్టీసీ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన మాదిరిగా మమ్మల్ని పర్మినెంట్ చేసి మా కుటుంబాలను ఆదుకోవాలని మధురిమ, మమతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కొత్తగా ఏఎన్ఎం ల నియామకం కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి మా సర్వీస్ క్రమబద్ధికరించాలన్నారు.అలాగే యూరోబిన్ కమిషన్ పేరుతో నియామకమైన ఏఎన్ఎం లకు 5 నెలలుగా వేతనాలు లేకజగిత్యాల జిల్లాలో 19 మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే జీతాలు చెల్లించాలని మిాడిదొడ్డి కోమల ప్రభుత్వాన్ని కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి సూచనల మేరకు సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంద్ర రాంచంద్రారెడ్డి నిరసనలో పాల్గొని ఏఎన్ఎం లకు సంఘీభావం తెలిపారు. అనంతరం అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు.నిరసన కార్యక్రమంలో సాధుల వసంత, వంగల నీరజ, నేరెళ్ల శోభారాణి, విజయ అరుణ కుమారి, మంద స్వరూప, శిరీష, మేరీ,లక్ష్మీ, మిాడిదొడ్డి కోమల, లావణ్య, లత, మల్లీశ్వరి, పూల, కళావతి, సునీత, చిలుకమ్మ, నీరజ, వసంత,సుప్రియ,గణిత, రాజ్యలక్ష్మి, శ్రీశైల తదితరులు పాల్గొన్నారు.

# అసిఫాబాద్ డిపో ఎదుట నిరసన

**కుమురం భీం ఆసిఫాబాద్ – ప్రభాత సూర్యుడు :** అసిఫాబాద్ డిపో ఎదుట నిరసన చేపట్టిన ఆర్టీసీ కార్మికులు.. టిఎస్ ఆర్టీసీ బిల్లును గవర్నర్ పెండింగ్ లో ఉంచినందుకు అసిఫాబాద్ బస్ డిపో లో మొత్తం 81బస్సులను ఉదయం 6గంటల నుండి 8 గంటల వరకు రెండు గంటల పాటు నిలిపివేసి గేట్ ముందు ధర్నా చేసిన కార్మికులు.ఆర్టీసీ విలీనం బిల్లుపై గవర్నర్ వెంటనే సంతకం చేయాలని డిమాండ్ చేశారుఆర్టీసీ బిల్లు విషయంలో గవర్నర్ తమిళ సై రాజ్యాంగ బద్దంగా వ్యవహరించడం లేదని తెలంగాణ మజ్దూర్ యూనియన్ టిఎంయు విమర్శించింది ఈరోజు ఉదయం 6 గంటల నుంచి 8 వరకు రెండు గంటలపాటు రాష్ట్రవ్యాప్తంగా బస్సులను నిలిపివేస్తామని టీఎంయూ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి ప్రకటించారు. వారి ఆదేశాల మేరకు ఆర్టీసీ ఉద్యోగుల విలీన బిల్లును శాసనసభలో ప్రవేశ పెట్టేందుకు గవర్నర్ వెంటనే అనుమతులు ఇవ్వాలని ఆర్టీసీ యూనియన్ డిమాండ్ చేశారుబిల్లు జాప్యానికి గవర్నర్ తమిళసై వైఖరి కారణమని విమర్శిస్తూ కార్మికులు డిపో ఎదుట నిరసన తెలిపారుకార్మికులు మాట్లాడుతూ ఆర్టీసీ బిల్లు ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని సీఎం కేసీఆర్ బిల్లు పెట్టడంతో ఎంతో సంతోషించామని అన్నారు ఈరోజు అసెంబ్లీ చివరి రోజు కావడంతో మాపై దయతలిచి గవర్నర్ తమిళ్ సై బిల్లు ఆమోదించాలని కార్మికులు వేడుకున్నారు అసిఫాబాద్ డిపోలో మొత్తం 81 ఆర్టీసీ బస్సులను నిలిపివేసి నిరసన తెలిపారు

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215